ఉచిత రక్త పరీక్షలు


రక్త పరీక్షలు చేస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: నగరంలోని ప్రముఖ మాగ్నిస్ డయాగ్నస్టిక్స్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సింగం శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఆర్‌కేపురంలోని చిత్రా లేఅవుట్‌లోని అనాథ విద్యార్థి గృహంలో సోమవారం ఉచిత రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. అనాథ విద్యార్థులకు సేవలు అందిస్తున్న విషయం తెలిసి అన్ని రకాల బ్లడ్ టెస్టులు ఉచితంగా అందించాలని నిర్ణయించి రక్త పరీక్షలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గృహ అధ్యక్షుడు మార్గంరాజేష్, శశిమోహన్ పాల్గొన్నారు.

పనుల పరిశీలన



చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన సర్కిల్ అధికారులతో కలిసి లక్ష్మీగణేష్ నగర్ కాలనీలో రూ. 40 లక్షలతో ప్రారంభించిన సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మురళీకృష్ణ, కోటేశ్వరరావు, సత్తిరెడ్డి, నాయకులు దశరథగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు బతుకమ్మ సంబరాలు

ఎల్‌బీనగర్: సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 25న బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్నట్లు మూడు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి వేడుకలు ప్రారంభం అవుతాయిన మహిళా సంఘాల సభ్యులు, మూడు సర్కిల్‌లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులు పాల్గొంటారన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో ముచ్చింతల్ జిమ్స్ ఆస్పత్రి వైద్యులు, మెడికల్ కాలేజ్ విద్యార్థుల ఆధ్వర్యంలో పోషణ్ మహ్, స్వస్థ్ నారీ స్వశక్త్ అభియాన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మహిళల ఆరోగ్యం, సమతుల ఆహారం, తల్లి ఆరోగ్యం, రక్తహీనత నివారణ, సమగ్ర శ్రేయస్సు, పోషకాహారంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు, బాలింతలు రోజు పాలు, గుడ్లు, పండ్లు, పప్పు ధాన్యాలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యులు సూచించారు. అనంతరం బాలింతలు, పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. జిమ్స్ వైద్య విద్యార్థులు నాటికలు, ఆటపాటల ద్వారా ఆరోగ్యం, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిమ్స్ విభాగం వైద్యురాలు ప్రొఫెసర్ డా.ఉమారాణి, ప్రొఫెసర్ డా.సురేఖరావు, మహేశ్వరం ఐసీడీఎస్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎ.శ్రీదేవి, వైద్యులు, అంగన్‌వాడి టీచర్లు, వైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక భవనాలు.. నెరవేరని ప్రయోజనాలు

పేద, మధ్యతరగతి ప్రజల సౌకర్యార్థం మల్టీపర్పస్, మినీ ఫంక్షన్‌హాళ్లను నిర్మిస్తామన్నారు..అనుకున్నదే తడవుగా అప్పటి రాష్ట్ర మంత్రితో శంకుస్థాపన చేశారు. దశాబ్దం కాలం అవుతున్నా మంజూరైన నిధులతో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ పనులను అడపాదడపా కానిచ్చి చేతులు ఎత్తేశారు. మరో మినీఫంక్షన్ హాల్ మాత్రం అరకొర వసతులతో పూర్తయినా ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు. -చంపాపేట

- అసంపూర్తిగా ఒకటి, పూర్తయిన మరొకటి
- అందుబాటులోకి రాని ఫంక్షన్ హాళ్లు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

నిధుల లేమి కారణమంటూ..

చంపాపేట డివిజన్ సుల్తానా అల్వా కాలనీలో సుమారు 2 వేల గజాల ప్రభుత్వ స్థలంలో రూ. రూ.1.20 కోట్ల నిధులతో పదేళ్ల క్రితమే మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్, రూ. కోటితో గాంధీవిగ్రహ చౌరస్తాలో మరో మినీ ఫంక్షన్ హాల్ భవన నిర్మాణానికి అప్పటి రాష్ట్రమంత్రి పట్నం మహేందర్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు చేశారు. చిన్నపాటి బర్త్‌డే ఫంక్షన్లు, వివాహాలు, సభలు, సమావేశాలకు మల్టీపర్పస్, మినీ ఫంక్షన్‌హాళ్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని డివిజన్ వాసులు ఆనందం పడ్డారు. ఈ పనుల కోసం మంజూరైన మొత్తం నిధులు 90 పనులకు మాత్రమే సరిపోయాయి అంటూ సదరు కాంట్రాక్టర్ చేతులు ఎత్తేశాడు. దీంతో ఆ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.


సుల్తానా అల్వా కాలనీలోని అసంపూర్తిగా మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్

నిర్దిష్ట రుసుం నిర్ధారించాలి..



చంపాపేట గాంధీ విగ్రహ చౌరస్తాలో మినీ ఫంక్షన్‌హాల్‌లో టాయిలెట్స్, త్రాగునీటి సౌకర్యాలు లేవు. అరకొర వసతులున్న ఫంక్షన్‌హాల్ అధికారికంగా ప్రారంభానికి నోచుకోలేదు. నిర్దిష్ట రుసుం ప్రకటన లేదు. శానిటేషన్ సిబ్బంది సర్కిల్ అధికారుల పేరిట వివాహ వేడుకల నిర్వాహకుల నుంచి రూ 11వేలు (హాలుకు మాత్రమే..ఇతర నిర్వహణ ఖర్చులు అదనం) అధికారికంగా వసూలు చేస్తున్నారు. చిన్న పాటి ఫంక్షన్‌లకు అధికారులతో ప్రమేయం లేకుండా నేరుగా వారే జేబులు నింపుకుంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి మినీ ఫంక్షన్ హాల్‌లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించటంతో పాటు అధికారికంగా ప్రారంభించి నిర్దష్ట రుసుం ప్రకటన చేయాలి.

– కట్టా వెంకటేష్, కటకోనికుంట


ధ్వంసమైన టాయిలెట్స్ తలుపులు

నిర్మాణాలు పూర్తి చేయాలి



మల్టీపర్పస్ ఫంక్షన్‌ల్ నిర్మాణం చేపడుతున్నారంటే సంబర పడ్డాం. పదేళ్లు కావస్తోంది. తొంభై శాతం నిర్మాణ పనులు చేపట్టి చేతులెత్తేయటంతో మా ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. ఆ ప్రాంతం ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– రాము, చిలుక బస్తీ

బల్దియా ఆదాయానికి గండి..

చంపాపేట గాంధీ విగ్రహ చౌరస్తాలోని మినీ ఫంక్షన్‌హాల్ విషయానికి వస్తే గత నాలుగు సంవత్సరాల క్రితమే అరకొర సౌకర్యాలతో నిర్మాణ పనులు పూర్తి అయినా ప్రారంభానికి మాత్రం నోచుకోవటం లేదు. పూర్తయిన ఫంక్షన్‌హాల్లో వేడుకలు చేసుకునేందుకు ఎవరిని సంప్రదించాలో తెలియక కొందరు శానిటేషన్ సూపర్‌వైజర్లకు గుట్టు చప్పుడు కాకుండా ముడుపులు చెల్లించి అనధికారిక వేడుక కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. జీహెచ్‌ఎంసీకి రావాల్సిన రుసుం సిబ్బంది జేబుల్లోకి వెళ్తుంది. ఉన్నతాధికారులు స్పందించి మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ పనులు పూర్తి చేయటంతో పాటు, పూర్తయిన ఫంక్షన్ హాల్‌ను అందుబాటులోకి తేవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.


పూర్తయినా అందుబాటులోకి రాని మరో మినీ ఫంక్షన్‌హాల్

'ఫిన్' సేవలు అభినందనీయం


రాపోలు భాస్కర్ సన్మానిస్తున్న ఫిన్ నిర్వాహకులు

మలక్‌పేట: వినికిడి లోపం(బధిర) విద్యార్థుల విద్యాభ్యాసం సైగల భాషలో చేయడంతో ఉన్నత స్థితికి చేరుకోగలరని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ అన్నారు. మలక్‌పేట ఫిన్ బధిర ఆశ్రమ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ సైగల భాష దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. బధిర నిరాశ్రయ నిరుపేద బాలబాలికలకు సైగల భాషతో చక్కటి చదువును అందిస్తున్న ఫిన్ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. డైరెక్టర్ జానకి మాట్లాడుతూ.. సైగల భాష ప్రాధాన్యంత వివరిస్తూ అనుభవం కలిగి ప్రత్యేక అధ్యాపకులచే ఆధునిక పద్ధతిలో పిల్లలకు నాణ్యమైన విద్యాబోధన అందించడం జరుగుతుందన్నారు. చదువుతో పాటు పిల్లలో దాగిఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫిన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణారెడ్డి, ఎంపీడీవో అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సరస్వతి, అనిత్, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల త్యాగాలు గుర్తించాలి

నాగోలు: సింగరేణి లాభాల్లో రిటైర్డ్ ఉద్యోగుల త్యాగాలు గుర్తించాలని, ప్రస్తుత ఉద్యోగుల లాభాల వాటా 10 శాతం నుంచి 34 శాతం పెరిగి లక్షల్లో పెరగడం సంతోషకరం కానీ, ఇదే లాభాలు సాధించేందుకు చెమటోడ్చిన విశ్రాంత ఉద్యోగుల సంక్షేమంపై మాత్రం యాజమాన్యం కనికరించక పోవడం బాధాకరమని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. బండల కింద అనుక్షణం మృత్యు గుహరాలలో కష్టపడిన సింగరేణి ఉద్యోగులు సంస్థ లాభాల పునాది వేసిన వారే అన్నారు. 24 ఏళ్లగా ఈ శ్రమజీవుల చెమట చుక్కలు లాభాల రూపంలో మారి సింగరేణి అంతర్జాతీయ గుర్తింపును తెచ్చారన్నారు. ఈ కష్టాల రాళ్ల పునాది వేసిన వేలాది మంది కార్మికులు పదవీ విరమణ అనంతరం తక్కువ పెన్షన్, వృద్ధాప్య వ్యాధులతో పోరాడుతూ కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సరిహద్దులో సిపాయి చేసే త్యాగం ఎంత గొప్పదో, సింగరేణి కార్మికుడు చేసిన త్యాగం కూడా అంతే గొప్పదని వీరి కోసం లాభాల్లో ఒక చిన్న వాటా కేటాయిస్తే అంతర్జాతీయ స్థాయిలో సింగరేణి ప్రతిష్ట మరింతా మార్మోగుతుందన్నారు.

25న సచివాలయం ముట్టడి


సుజాతకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నాగోలు: అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న నిర్వహించన్ను తెలంగాణ సచివాలయం ముట్టడిని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ప్రీ ప్రైమరీ విద్యను అంగన్వాడీ కేంద్రాలకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సరూర్‌నగర్ సీడీపీవో సీనియర్ అసిస్టెంట్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. పీఎం శ్రీవిద్యను అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహించాలని, అదనపు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రణాళికలో ప్రకటించిన రూ.18,000 వేతనం ఇవ్వాలని పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలని, రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు ఎలాంటి షరతుల్లేకుండా ఆసరా పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిషన్, నరసింహ, ఎల్లయ్య, సుకన్య కుమారి, గంగ, గౌరమ్మ, సత్యమ్మ, లతా, సరస్వతి, నిర్మల, నీలమణి పాల్గొన్నారు.

చైన్ తెంచుకుని..నోటికి ప్లాస్టర్ వేసి..

పోలీసుల అదుపులో స్నాచింగ్‌కు పాల్పడిన మహిళ


బాధితురాలితో మాట్లాడుతున్న ఏసీపీ కృష్ణయ్య

నాగోలు: ఒంటరిగా ఉంటున్న ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు తెంచుకొని ఆమె నోటికి ప్లాస్టర్ వేసి పారిపోయిన మహిళను నాగోలు పోలీసుల మూడు గంటల్లోనే పట్టుకున్నారు. ఆనంద్‌నగర్ రోడ్ నెంబర్–4లో నివాసముంటున్న ధూళిపాళ ధనలక్ష్మి (65)కి ముగ్గురు ఆడపిల్లలు. వారందరికీ పెళ్లి కావడంతో ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. మంగళవారం ఉదయం ముసుగు ధరించి వచ్చిన ఓ గుర్తు తెలియని మహిళ, ధనలక్ష్మి ఇంట్లోకి దూరి మెడలో ఉన్న తులం బంగారు గొలుసు లాక్కొని ఆమె నోటికి ప్లాస్టర్ వేసి వెళ్లిపోయింది. కాసేపటి తర్వాత బయటకు వచ్చిన బాధితురాలు స్థానికుల సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాల సహాయంలో ఫతుల్లాగూడ సర్వే నెంబర్–58కి చెందిన ప్రవంతిగా పోలీసులు గుర్తించారు. ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, నాగోలు సీఐ మక్బూల్ జానీ బాధితురాలిని పరామర్శించారు.

వరద సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తా


ముంపు ప్రాంతంలో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్‌లో వరద సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని హరిహరపురం,స్నేహమయి నగర్ కాలనీ, వినూత్న ఎంక్లేవ్, గాంధీనగర్, గాంధీ నగర్ సౌత్, అఖిలాండేశ్వరి కాలనీలు ముంపునకు గురైన నేపథ్యంలో మంగళవారం ఆయన ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానికులతో మాట్లాడారు. వరద సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా కృషి చేస్తున్నామని గుర్రంగూడ ఫారెస్ట్‌లోని రాగికుంట నుంచి గాంధీనగర్–స్నేహమైనగర్–పీవీఆర్ కాలనీ–సామ నగర్ నుండి కుమ్మరికుంట వరకు వరదకాలువ నిర్మాణం కోసం హరిహరపురం చెరువు నుంచి వివేకానంద విగ్రహం, శివసింధు చౌరస్తా–శివాలయం, గౌతమి నగర్, బతుకమ్మకుంట మీదుగా కుమ్మరికుంట వరకు వరదకాలువ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి వచ్చే వర్షాకాలం వచ్చే లోపు వరద ముంపు సమస్య పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అరవింద్ రెడ్డి, అనిల్ చౌదరీ, సందీప్ రెడ్డి, కాజా శ్రీనివాస్, రషీద్, నరేష్, విష్ణువర్ధన్ రెడ్డి, శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.27, వంకాయ రూ.23, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.26, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.19, క్యారెట్ రూ.41, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.18, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.50, చామగడ్డ రూ.23, మునగ రూ.105, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.28, కీర రూ.23, బీన్స్ రూ.50, క్యాప్సికమ్ రూ.50. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

వేడుకలు ఐక్యతను పెంచుతాయి


రాంచందర్‌రావ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చీకోటి ప్రవీణ్‌కుమార్

సైదాబాద్: భక్తిశ్రద్ధలతో సందడిగా జరుపుకునే వేడుకలు, ఉత్సవాలు అందరిలో ఐక్యతను పెంచుతాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు చీకోటి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాంచందర్ రావును ఆయన కార్యాలయంలో కలిసి దేవీ శరన్నవరాత్రి వేడుకలు పురస్కరించుకొని ఏర్పాటు చేస్తున్న మాతా కీ చౌకీ ప్రత్యేక పూజలకు రావాలని ఆహ్వానించారు. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని వినయ్‌నగర్ కాలనీలోని శ్రీవిజయ వినాయక దేవాలయం ప్రాంగణంలో ఈనెల 27న మాతా కీ చౌకీ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు.

అమ్మవారి రూపం.. దివ్యదర్శనం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లోని మండపాలు, దేవాలయాల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్లను రోజుకో రూపంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. ప్రత్యేక అర్చనలు, పూజలతో ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది.

-ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం


బాలాత్రిపుర సుందరిగా విజయదుర్గ అమ్మవారు


శ్రీగాయత్రీ దేవిగా జయదుర్గా మాత


శ్రీ మహంకాళి దేవాలయంలో ప్రత్యంగిరా మహాహోమం నిర్వహిస్తున్న దృశ్యం


గాయత్రీ దేవిగా ప్రత్యంగిరా అమ్మవారు


మన్సురాబాద్‌లో దుర్గా మాతకు పూజలు చేస్తున్న రఘువీర్‌రెడ్డి


పూజలో పాల్గొన్న మేయర్ విజయలక్ష్మికి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ చైర్మన్ శ్రీనివాస్


ఓల్డ్‌మలక్‌పేట పోచమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకున్న నాయకులు


అమ్మవారిని దర్శించుకున్న సుభాష్‌చందర్జీ, సునీల్‌రెడ్డి


మూసారంబాగ్ దుర్గా రాజరాజేశ్వరి దేవాలయంలో కమిటీ సభ్యుల పూజలు

మనువాదాన్ని వ్యతిరేకిద్దాం


మలక్‌పేట పాపయ్యబస్తీలో బతుకమ్మ వేడుకల్లో మల్లు లక్ష్మి

చాదర్‌ఘాట్: బానిసల కాలం నాటి ఆలోచనలను ప్రేరేపిస్తున్న మనువాదాన్ని వ్యతిరేకించాలని మహిళ హక్కుల సాధనకు ఉద్యమించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. ఐద్వా హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ మలక్‌పేటలో పాపయ్యబస్తీలో నిర్వహించిన బతుకమ్మ సందడిలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. భూస్వాములు, పెత్తందారులను వ్యతిరేకించి చైతన్యం కల్పించింది కమ్యూనిస్టు పార్టీ అని గుర్తు చేశారు. ఆ జ్ఞాపకాలను చెరిపేందుకు బానిసల కాలం నాటి మనువాదాన్ని కొందరు ముందుకు తెస్తున్నారని, మహిళలు చైతన్యవంతులై హక్కుల సాధనకు పోరాడాలన్నారు.


బతుకమ్మ వేడుకల్లో సిదార్థ ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ గోవర్ధని


బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

ఆరోగ్య రక్ష.. మహిళలకు భరోసా

- బస్తీ దవాఖానాల్లో 48 రకాల టెస్టులు
- ప్రతి మంగళవారం వైద్య పరీక్షలు, నిపుణులతో కౌన్సెలింగ్

చాదర్‌ఘాట్: వ్యాధులను ముందుగానే గుర్తించి కట్టడి చేసే ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చి విజయవంతంగా అమలు చేస్తోంది. రక్తహీనత, థైరాయిడ్, క్యాన్సర్ వంటి జబ్బులకు ముప్పు నుంచి తప్పిస్తూ ఆరోగ్య భరోసా కల్పిస్తోంది. మలక్‌పేట నియోజకవర్గంలో 15 బస్తీ దవాఖానాల పరిధిలో ఆరోగ్య మహిళ కార్యక్రమంలో విజయవంతంగా కొనసాగుతుండగా ప్రతి వారం 40–50 మంది మహిళలు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించుకుంటూ వివిధ వ్యాధులకు సంబంధించి ఉచితంగా రక్త పరీక్షలను కూడా చేయించుకుంటున్నారు.

అవగాహన కార్యక్రమాలు..

ప్రైవేటు ఆస్పత్రుల్లో వేలాది రూపాయలు ఖర్చయ్యే ఈ చికిత్సలు బస్తీ దవాఖానాల్లో ఉచితంగా నిర్వహించడమే కాకుండా వైద్యులు మెరుగైన సూచనలు సలహాలు చేస్తున్నారు. బాలింతలు, గర్భిణులతో పాటు సాధారణ మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ఈ కార్యక్రం ఉద్దేశం. ప్రతి మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా క్షేత్రస్థాయిలో చైతన్యం కలిగిస్తూ మహిళలకు అవగాహన సైతం కల్పిస్తున్నారు. క్యాన్సర్ లక్షణాలను గుర్తించిన వారిని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో ఉచితంగా చికిత్సలు అందేలా చర్యలు తీసుకొంటున్నారు.


మహిళలకు కౌన్సెలింగ్ ఇస్తున్న వైద్య సిబ్బంది

హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి..

బస్తీ దవాఖానాల్లో 48 రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఆస్పత్రుల్లో వివరాలను నమోదు చేసుకొన్న మహిళ సమాచారాన్ని ప్రత్యేకమైన యాప్‌లో నమోదు చేస్తున్నారు. రక్త నమూనాలను సేకరిస్తూ ప్రాథమిక స్థాయిలోనే కొన్నింటిని గుర్తిస్తున్నారు. రొమ్ము, గర్భాశయం, ఓరల్, నోటి క్యాన్సర్, థైరాయిడ్, హార్మోన్ల అసమతుల్యత, సూక్ష్మ పోషకలోపాల గుర్తింపు మూత్రాశయ ఇన్ఫెక్షన్లు, లైంగిక వ్యాధులు, బరువు తగ్గుదల వంటి పరీక్షలు నిర్వహించి ఫలితాలను ఆయా ప్రభుత్వ ఆసుపత్రులకు పంపిస్తూ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. మహిళ ఆరోగ్యానికి బస్తీ దవాఖానాలు వారధిగా పనిచేస్తున్నాయి.